క్లుప్తంగా

నంద్యాల కవికి సన్మానం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కొలుకులూరి ఇనాక్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన కవి కొప్పుల ప్రసాద్‌కు సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కొప్పుల ప్రసాద్ మాట్లాడుతూ తాను రచించిన సూర్యపు మనసులో చిగుర్లు పుస్తకావిష్కరణను పద్మశ్రీ కొలుకులూరి ఇనాక్ ఆవిష్కరించారని చెప్పారు. ఓలేటి పార్వతీశం, సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణారావు, వాసిరెడ్డి మల్లేశ్వరి పాల్గొన్నారు.

రాయల పాలన ఆదర్శం



ఉయ్యాలవాడలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: నాటి శ్రీకృష్ణదేవరాయల పాలన ఆదర్శనీయమని బలిజ సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక కమతం వీధిలోనున్న శ్రీ కృష్ణదేవరాయుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ట్రెజరర్ అర్జిగారి నరసింహుడు, కమతం చిన్న రాముడు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీపీ నాగిరెడ్డి, అధికారులు

గోస్పాడు: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ అసోసియేషన్ సహకారంతో రూపొందించిన క్యాలెండర్లను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్ కరీం, ఎంపీడీఓ అనసూయ, కార్యాలయ సిబ్బంది రవి, చంద్రమౌళి, సీఆర్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

ఉయ్యాలవాడ : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మాజీ గ్రామ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కూలూరు రామకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని అల్లూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర గ్రామ సభలు నిర్వహించారు. ఆధునిక టెక్నాలజీతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం ఎలా అనే అంశాలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ వినియోగంపై పలు సూచనలు చేశారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డి వెంకటేశ్వర్లు, ఏఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత 'ఆరోగ్య సురక్ష'

ఉయ్యాలవాడ: మండలంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 2న అల్లూరు గ్రామ సచివాలయం, 9న సుద్దమల్ల, 19న ఇంజేడు, 23న తుడుమలదిన్నె, ఫిబ్రవరి 2న కొండుపల్లె, 9న ఆర్.జంబులదిన్నె, 16న బోడెమ్మనూరు 23న హరివరం గ్రామ సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు



మల్లన్న దర్శనార్థం వస్తున్న రామ్‌నాథ్ పార్థి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం రాత్రి షెడ్యూల్డ్ క్యాస్ట్ నేషనల్ కమిషన్ మెంబర్ సుభాష్ రామ్‌నాథ్ పార్థి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ప్రధానాలయ రాజగోపురం వద్ద చేరుకున్న ఆయనకు దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

వెల్లువెత్తిన నూతనోత్సాహం

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- వైఎస్సార్‌సీపీలో జోష్ నింపిన న్యూ ఇయర్ వేడుకలు
- వాడవాడలా పార్టీ శ్రేణుల కోలాహలం
- కిటకిటలాడిన వైఎస్సార్‌సీపీ కార్యాలయం





గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డిని గజమాలలు వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు, ఎమ్మెల్యే శిల్పా రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ఆళ్లగడ్డ: కోటి ఆశలు.. కొంగొత్త ఆశలు, ఆశయాలతో నియోజకవర్గ ప్రజలు సోమవారం నూతన ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. పాత ఏడాది మిగిల్చిన జ్ఞాపకాలతో సరికొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు. వాడ వాడలో ప్రజలంతా నూతన సంవత్సర సంబరాల్లో మునిగిపోయారు.

వైఎస్సార్‌సీపీలో జోష్ నింపిన వేడుకలు..

పట్టణంలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు వెస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత జోష్ నింపాయి. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధ్యక్షతన పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సంబరాలకు ఆరు మండలాల నుంచి మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, గ్రామ, సచివాలయాల కన్వీనర్లు వేలాదిగా తరలివచ్చి వారిని గజమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే.. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సెక్రటరీ నారాయణ స్వామి ఆధ్వక్షతన ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

శిరివెళ్ల: మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి నుంచే 2023కు వీడ్కోలు పలుకుతూ 2024 సంవత్సరానికి టపాసులు పేల్చి ప్రజలు స్వాగతం పలికారు. ఉదయం ప్రజలు ఆలయాలకు వెళ్లి కొత్త ఏడాది తమ కుటుంబాన్నికి అంతా మేలు జరగాలని పూజలు చేశారు. వైఎస్సార్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆళ్లగడ్డకు వెళ్లి గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్టి కార్యాలయాలలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అంబరాన్నంటిన సంబరాలు..

నంద్యాల: నియోజకవర్గంలో కొత్త సంవత్సరం వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం 2024లోకి అడుగు పెట్టిన సందర్భంగా ప్రజలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి బాణ సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. నంద్యాల పట్టణంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగారెడ్డికి అధికారులు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు పట్టణంలోని 42వార్డులకు చెందిన ప్రజలతో పాటు నంద్యాల, గోస్పాడు మండలంలోని 40గ్రామాల పంచాయతీలకు చెందిన ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలపడానికి తరలిరావడంతో వారి నివాసాలు కిటకిటలాడాయి. బొకేలు, పూలదండలు వద్దు.. మొక్కలు, పుస్తకాలు తీసుకు రండి అనే పిలుపు మేరకు ఎమ్మెల్యేకు చాలా మంది పుస్తకాలు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగ్‌లు తదితర వాటిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే.. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా మున్సిపల్ కార్యాలయంలో, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి బొమ్మలసత్రంలోని పార్టీ కార్యాలయంలో, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పీపీ మధుసూదన్‌రెడ్డికి ఎన్‌జీఓ కాలనీలో, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన ఎన్‌జీఓస్ కాలనీలోని తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తుల, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద..

నూతన సంవత్సరం సందర్భంగా తమ పైస్థాయి అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఉద్యోగులు కార్యాలయాల వద్దకు పూలమాలలు, బొకేలు, మిఠాయిలు, పండ్లు తీసుకొచ్చారు. దీంతో ఆయా కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. డీఎస్పీ మహేశ్వరరెడ్డిని సీఐలు, ఎస్‌ఐలకు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆయా శాఖల ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలందరిలో నూతన సంవత్సర ఉత్సాహం నెలకొంది. ప్రజలు ఒకరి నొకరు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలుపుకున్నారు. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగులు పూల బొకేలు, పూలమాలలు, స్వీట్ బాక్స్‌లు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇక వివిధ పార్టీ నాయకులు, అభిమానులు సంబరంగా బాణ సంచా పేల్చుతూ గ్రామ,మండల స్థాయి,నియోజకవర్గ స్థాయి నాయకులు,ప్రజా ప్రతినిధులను కలిసి గజ మాలలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రుద్రవరంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డిపి పలువురు నాయకులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎర్రగడిదిన్నెలోనున్న పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి ఇంటికి చేరుకొని అక్కడ సంబరాలు నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలో నూతన సంవత్సరం వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డిని ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని ఆళ్లగడ్డలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చాగలమర్రి: 2024 నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం, మండలంలోని పలువురు నాయకుల ఇళ్ల వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కోలాహలంగా మారింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్ బాబులాల్, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, చక్రం షబ్బీర్ ఆహ్మద్, ఎంపీపీ వీరభద్రుడు, పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు సి.వెంకటరమణ, ములా ఖాదర్‌బాషాను నాయకులు, కార్యకర్తలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు జి.ఇబ్రహీం, కార్యదర్శి కె.అబ్దుల్లా, వార్డు మెంబర్ బురాందీన్, మండల యువజన విభాగం అధ్యక్షుడు వి.మహబూబ్‌షరీఫ్, ట్రెజరర్ పెయింటర్ రఫీ పాల్గొన్నారు.



రాజగోపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



గంగుల ఇందిరమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లీం మైనార్టీ నాయకులు



మార్కెట్ యార్డ్‌లో సంబరాల్లో పాల్గొన్న చైర్మన్ గంధం రాఘవరెడ్డి, పాలక మండలి సభ్యులు



ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



ఎమ్మెల్యే శిల్పా రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దాం

నంద్యాల: నూతన సంవత్సరంలో నంద్యాల జిల్లా అభివృద్ధికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ప్రజలు మెచ్చే రీతిలో సమష్టిగా నూతనోత్సాహంతో పనిచేద్దామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం అధికారుల సమక్షంలో కలెక్టర్ కేక్ కట్ చేశారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి డీఆర్‌ఓ పుల్లయ్య, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వారి కారాలయాల్లో కలిసి పూలమొక్కలు, పండ్లు, బొకేలు అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు



జాయింట్ కలెక్టర్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య, అధికారులు



పీపీ నాగిరెడ్డికి కేక్ తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

● కోవెలకుంట్లలో

కొత్త వెలుగులు



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కోవెలకుంట్ల కొత్త కాంతులతో విరాజిల్లుతోంది. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో స్థానిక ముదిగేడు చౌరస్తా నుంచి జమ్మలమడుగు చౌరస్తా వరకు రూ. 8 కోట్లతో 800 మీటర్ల మేర కొత్తగా డివైడర్‌తో కూడిన సీసీరోడ్డు ఏర్పాటు చేశారు. డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ అమర్చారు. 2024 నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించడంతో కొత్త శోభను సంతరించుకుంది. –కోవెలకుంట్ల

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయమైన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సమ్మె చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. శివ బాలకృష్ణ, శ్రీనివాసులు, రంజిత్,ప్రతాప్, శివరాము డు, మస్తాన్, కుశాయి స్వామి, సంజీవ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లానరసింహులుతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సీపీఐ కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, సుంకన్న, ధనుంజయుడు, నాగరాముడు శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్, రఫీ, చౌడప్ప తదితరులు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు.

5 నుంచి చౌడేశ్వరి ఆలయంలో చండీయాగం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు చండీయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామానుజన్ సోమవారం తెలిపారు. చౌడేశ్వరి దేవి దీక్ష విరమణ పూజలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొంటున్నారని చెప్పారు.

చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా పట్టణంలోని వివిధ చర్చీల్లో ఆదివారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి ఆయా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి, సమాధానం, ప్రేమ గుణంతో క్రైస్తవులు ముందుకు వెళ్లాలని సూచించారు. మానవాళి మధ్య శాంతి, కరుణ, సహోదర ప్రేమను నెలకొల్పేందుకే క్రీస్తు ఈ లోకానికి వచ్చారని ఏసు జననం మానవాళికి రక్షణ కవచమన్నారు. పట్టణంలోని ఇండియా పెంతికోస్తు ప్రార్థనా మందిరం, పవర్ టెంపుల్, ఎలిశద్దాయి ప్రార్థనా మందిరాల్లో ఎమ్మెల్యే పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి డీనరీ చైర్మన్ రెవరెండ్ జోసెఫ్ బాబు, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2(ఆల్ సెయింట్ చర్చి)లో రెవరెండ్ డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్, విజయ్‌కుమార్, జోయల్‌లు న్యూ ఇయర్ ప్రార్థనల్లో దైవసందేశం అందించారు. ఐపీసీ బిషప్ అన్నాస్, పాస్టర్ జాషువా, ఎలిశద్దాయి ప్రార్థనా మందిరం నిర్వాహకులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్ అమృతరాజ్, జయప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెక్రటరీ కారు రవి కుమార్ ఉన్నారు.



పవర్ టెంపుల్ ఆలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

ఓంకారేశ్వరుడికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామి వారు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం ఆలయంలో వెలిసిన శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి వార్లకు సోమవారం ఉదయం విశేషంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

బొమ్మలసత్రం: అతి వేగం.. ఓ యువకుడి ప్రాణాలను బలిగింది. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. సంగపేటకు చెందిన కిరణ్, అదే వీధికి చెందిన ప్రశాంత్ స్నేహితులు. డిసెంబర్ 31 రాత్రి 12 గంటలకు పీవీ నగర్ నుంచి ఇద్దరూ కలిసి ఇంటికి బయలుదేరారు. కిరణ్ బైక్‌ను వేగంగా నడపడటంతో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కిరణ్ అక్కడిక్కడే మృతి చెందగా ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ప్రశాంత్‌ను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్రమత్తతే ఔషధం

- కుష్టు రోగులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే
- వచ్చే నెల 12వ తేదీ వరకు నిర్వహణ
- 1,611 బృందాలతో జిల్లా వ్యాప్తంగా సర్వే
- రోగుల గుర్తింపు, వ్యాధి నిర్మూలనే లక్ష్యం



లెప్రసీ సర్వే చేస్తున్న అధికారులు

నంద్యాల టౌన్: కుష్టు వ్యాధిని నివారించేందుకు అప్రమత్తతే అసలైన ఔషధమని వైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 27 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందు కోసం జిల్లాలో 1,611 బృందాలను సిద్ధం చేశారు. ప్రతి బృందంలో ఒక ఆశా కార్యకర్త, సచివాలయ వలంటీర్లు ఉంటారు. ఇంటింటికీ తిరిగి కుష్టు వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలిస్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని సమీప ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్యులతో పరీక్ష చేయిస్తారు.

వ్యాధి నిర్ధారణ ఇలా..

శరీరంపై ఉండే స్పర్శ లేని మచ్చలు, నాడుల వాపు ఆధారంగా వ్యాధిని నిర్ధారిస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో వైద్యాధికారి, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సంయుక్తంగా వ్యాధిని నిర్ధారిస్తారు. శరీరంపై స్పర్శ లేని మచ్చల ఆధారంగా ఈ వ్యాధిని 2 రకాలుగా విభజిస్తారు. ఇవి పీబీ, ఎంబీగా ఉంటాయి. శరీరంపై ఐదు కన్నా తక్కువ మచ్చలు ఉంటే పీబీ వీటిని ఆరునెలలు మల్టీ డ్రగ్ థెరపీతో చికిత్స చేసి నివారణ చేస్తారు. ఐదు కంటే ఎక్కువ ఉంటే ఎంబీగా నిర్ధారించి 12 నెలలు చికిత్స అందిస్తారు. లక్షణాలు వున్న వారిని సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షిస్తారు. వ్యాధినిర్ధారణ అయితే వారిని మెరుగైన చికిత్స కోసం సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తారు. ఇదే సమయంలో కేసు బయటపడిన చుట్టుపక్కల 300 ఇళ్లల్లో స్క్రీనింగ్ చేస్తారు. కేసు బయటపడిన ఇంట్లోని వారందరికీ కుష్టు లేకపోయినా ముందు జాగ్రత్తగా మందులు ఇస్తారు.

జిల్లాలో ప్రస్తుత పరిస్థితి..

నంద్యాల జిల్లా ఏర్పాటైయినప్పటి నుంచి 2021-22లో 79 కేసులు, 2022-23 లో 136 కేసులు, 2023-24లో ఇప్పటి వరకు 102 కేసులు గుర్తించారు. ఇప్పటి వరకు జిల్లాలో వ్యాధి వల్ల అంగవైకల్యం కలిగిన 530 మంది బాధితులను గుర్తించారు. వీరిలో 212 మందికి ఏడాదికి రెండుసార్లు ఉచితంగా పాదరక్షలు అందిస్తున్నారు. వీరిలో అర్హులైన 212 మందికి పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. అంగవైకల్యం కలిగిన వారికి డీపీఎంఆర్ సేవలు అందిస్తున్నారు. ఆర్‌సీఎస్ చికిత్స చేయించుకున్న వారికి ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం రూ.12 వేలు ఆర్థిక సహాయం చేస్తుంది.

ప్రాథమిక దశలో గుర్తించాలి



కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఎండీటీ చికిత్స చేయడం వల్ల నరాలు దెబ్బ తినకుండా కాపాడవచ్చు. వ్యాధిపై భయం పోగొట్టి అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చు. కుష్టు వ్యాధి నివారణకు ప్రజలందరి భాగస్వామ్యం అవసరం. పౌష్టికాహారం తీసుకుంటూ, చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చు.

– డాక్టర్ శారదబాయి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి, నంద్యాల

ఇంటింటికీ అయోధ్య అక్షితలు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అయోధ్య అక్షితలను పంపిణీ చేశారు. కొద్ది రోజుల క్రితం అయోధ్య శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామ గ్రామానికి స్వామి వారి అక్షితలను అందజేశారు.వాటిలో మరిన్నిటిని ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. తువ్వపల్లెలో స్వామి వారి ఆలయం నుంచి భక్తులు మేళ తాళాలతో ఇంటింటికీ తిరిగి వాటిని అందజేశారు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ అక్షితలు, రాముల వారి ఫోటో,కరపత్రం అందించారు. రుద్రవరంలోనై అక్షితల పంపిణీ చేపట్టారు.

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భరతమాత దేవాలయం ఆలయ మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఇంటింటికీ అయోధ్య అక్షితలను సోమవారం పంపిణీ చేశారు. నాగేంద్రమ్మ, ప్రవీణ మాట్లాడుతూ బాలాజీ కాంప్లెక్స్, టెక్కె, నూనెపల్లె, తదితర ప్రాంతాల్లో అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షితలను కరపత్రాలతో పాటు అందజేస్తున్నామని చెప్పారు. సుహాసిని, లక్ష్మికుమారి, రమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చాగలమర్రి: మండల కేంద్రంలో అయోధ్య అక్షితలను సోమవారం హిందూ, అర్యవైశ్యులకు ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ తొమ్మండ్రు భవానమ్మ, యల్లంపల్లె లక్ష్మీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.



అక్షితలు పంపిణీ చేస్తున్న మహిళలు